సాక్షి అనకాపల్లి

శనివారం । 3 । ఆగస్టు । 2024



తైక్వాండో పోటీలు ప్రారంభం

జాతీయ 7వ క్యాడెట్ కొరుగి పూమ్‌సే తైక్వాండో చాంపియన్‌షిప్‌ను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. IIలో



'పింగళి'కి నివాళి

విశాఖ: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఏయూ లా కాలేజీ ప్రిన్సిపాల్ సీతామాణిక్యం నివాళులర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.2/35.1

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తోంది భీమిలి మండలం టీ.నగరంపాలెంలో గ్రామ సచివాలయం. కొత్తగా నిర్మించిన భవనమిది. గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణానికి రూ.15 లక్షలు, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణానికి రూ.25 లక్షలు. మొత్తంగా ఈ భవనాన్ని అన్ని హంగులతో నిర్మించేందుకు రూ.**40** లక్షలు ఖర్చు అయ్యింది.



ఇదిగో.. ఈ ఫొటోలో కనిపిస్తోంది భీమిలిలో నిర్మాణం పూర్తయిన అన్నా క్యాంటీన్. దీనికి మరమ్మతులు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల విరిగిన టైల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, టాయిలెట్స్ మరమ్మతులు, రంగులు వేయడం.. ఈ పనులకే అక్షరాలా రూ.**16.50** లక్షలు ఖర్చు చేస్తున్నారు. సచివాలయంలో ఒక ఫ్లోర్‌ను అన్ని హంగులతో నిర్మించేందుకు రూ.**15** లక్షలు ఖర్చయితే.. అన్నాక్యాంటీన్లలో చిన్న చిన్న మరమ్మతులకే అంతకు మించి ఖర్చు చేస్తున్నారు.



ఇది పద్మనాభంలోని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్‌తో నిర్మించిన గ్రామ సచివాలయం. భారీగా కనిపిస్తున్న ఈ భవనం నిర్మించేందుకు కేవలం రూ.**25** లక్షలు మాత్రమే ఖర్చు చేశారు.



మరి ఈ అన్నా క్యాంటీన్ చూశారా? అనకాపల్లిలో గతంలో నిర్మించిన అన్నా **క్యాంటీన్ ఇది. దీనికి** రంగులద్దుతూ చిన్న **చిన్న మరమ్మతులు** చేసేందుకు **రూ.19 లక్షలు ఖర్చు** చేస్తున్నారంట.

అన్నన్నా.. ఇంత ఖర్చా!



జనతాబజార్ అన్నా క్యాంటీన్‌కు రూ.18 లక్షలు

ఇది 35వ వార్డులోని జనతా**బజార్‌లో ఉన్న** అన్నా క్యాంటీన్. దీని మరమ్మ**తులకు** కేటాయించిన మొత్తం వింటే **దిమ్మతిరిగి మైండ్** బ్లాక్ అవ్వాల్సిందే. రంగులు, **టైల్స్ వేసేందుకు** ఏకంగా రూ.18 లక్షలు ఖర్చ**వుతుందంట.**



శివనగర్ క్యాంటీన్‌కు రూ.15.56 లక్షలు

ఈ క్యాంటీన్ 53వ వార్డులోని శివనగర్‌లో ఉంది. కేవలం రంగులేసి బిల్డింగ్ లోపల కొంచెం టచప్ ఇస్తే చాలు. కానీ ఇక్కడేదో మరో అంతస్తు కడుతున్నట్లుగా ఏకంగా రూ.15.56 లక్షలతో పనులు చేస్తున్నారంటే విడ్డూరంగా ఉంది మరి. ఇలా ప్రతి క్యాంటీన్‌లోనూ కూటమి నేతల అక్రమాలు.. అడ్డగోలు అమ్యామ్యాలే తప్ప.. నిజంగా పనులు చేసేందుకు కాదన్నది స్పష్టమవుతోంది.

- **రూ. 3.5 కోట్లతో 25 అన్నా క్యాంటీన్లకు మరమ్మతులు**
- **ఒక్కో క్యాంటీన్‌కు రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షల మేర వ్యయం**
- **అంచనాల్లో ఇంజినీరింగ్ అధికారుల చేతివాటం**
- **మరమ్మతు పనుల్లో టీడీపీ కాంట్రాక్టర్లు**
- **పత్తాలేని సూపర్ సిక్స్..**
- అన్నా క్యాంటీన్లకు మాత్రం నిధులు మంజూరు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉన్న క్యాంటీన్లకు కొత్త రంగులద్దే కార్యక్రమంలో రూ.కోట్లు కొల్లగొట్టేందుకు టీడీపీ నేతలు స్కెచ్ వేశారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో ఉన్న అన్నా క్యాంటీన్లను ఆగస్టు 15లోగా సిద్ధం చేయాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. అనుకున్నదే తడవుగా.. జీవీఎంసీ అధికారులు పనులు నిర్వహించేందుకు అంచనాలు సిద్ధం చెయ్యడం..కాంట్రాక్టరకు అదీ కూటమి ప్రభుత్వానికి చెందిన కాంట్రాక్టర్లకు మాత్రమే పనులు అప్పగించేలా వ్యవహారం చకచకా నడిచిపోయింది. ఇంకేం ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా.. వేసిందే అంచనా.. చేసిందే పని.. రీతిలో అన్నాక్యాంటీన్ల మరమ్మతులలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి.

అంచనాల్లోనే అవినీతి...!

వాస్తవానికి ఈ అవినీతి వ్యవహారం మొదలైందంతా అంచనాలు సిద్ధం చేసే ప్రక్రియ నుంచే. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు క్యాంటీన్ మరమ్మతులకు సంబంధించిన అంచనాల్లోనే అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న చిన్న మరమ్మతులు చేస్తే చాలు.. ఉన్న భవనం మళ్లీ వినియోగించుకోవచ్చని తెలిసినా.. తమ ఖాతాలు, అధికార పార్టీ నేతల జేబులు నిండేలే అంచనాలు సిద్ధం చేశారు. ఒక భవనం నిర్మిస్తే.. ఎంత వ్యయం అవుతుందో.. దానికి సమానంగా మరమ్మతు పనులకు వ్యయ ప్రణాళికలు తయారు చేయడం విడ్డూరం. మొత్తం 25 క్యాంటీన్ల మరమ్మతులకు ఏకంగా రూ.3.50 కోట్లు ఖర్చవుతుందని లెక్క కట్టారు. క్యాంటీన్ పనుల అంచనాలు చూస్తే.. మరో రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలు వెచ్చిస్తే ఏకంగా కొత్త వాటి నిర్మాణం చేపట్టవచ్చునన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి కాంట్రాక్టర్లకే...!

సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేమంటూ స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా ఏకరవు పెట్టారు. కానీ అన్నాక్యాంటీన్లు మాత్రం ప్రారంభించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కారణం ఈ క్యాంటీన్ల మాటున.. కూటమి నేతలకు లబ్ధి చేకూర్చేందుకేనన్నది స్పష్టమవుతోంది. అందుకే వీటి మరమ్మతులకు సంబంధించి షార్ట్‌టర్మ్ టెండర్లతోనే పనులు అప్పగించేశారు. ప్రతి క్యాంటీన్‌కు సంబంధించిన పనిని తాము సిఫారసు చేసిన వారికే ఇవ్వాలని ఇప్పటికే టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఇందుకు అనుగుణంగా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను కూడా మార్చేసి అందర్నీ జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఏమార్చేశారు. ఒక భవనం నిర్మించేందుకు అయ్యే ఖర్చుతో స్వల్ప మరమ్మతు పనులు నిర్వహించి రూ.కోట్లలో ఖజానాకు కన్నం పెట్టేందుకు కూటమి నేతలు హడావుడి పడుతున్నారు.



తగరపువలస అన్నాక్యాంటీన్‌కు రూ.16.50 లక్షలు

ఇది తగరపువలసలో ఉన్న అన్నక్యాంటీన్. **భవనమంతా భేషుగ్గా ఉంది.** రంగులేసి కాస్తా మెరుగులద్దితే చాలు. ఈ పనులకు అక్షరాలా రూ.16.50 లక్షలు కేటాయించారు.

అందరివాడు బొత్స



ఆయన పేరు బొత్స సత్యనారాయణ.. కానీ అందరూ ఆయనను అభిమానంగా సత్తిబాబు అని పిలుచుకుంటారు. విభిన్నమైన నాయకుడు బొత్స. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అలంకరించారు. అన్నిటి కంటే అందరివాడుగా పేరు పొందడమే ఆయనకు పెద్ద అలంకారం. సామాన్యులు వెళ్లి తమ కష్టం చెప్పినా ఆయన వెంటనే స్పందించి వారి సమస్య పరిష్కరిస్తారని ప్రతిపక్షంలోని వారు సైతం చెప్పుకునే మాట. అలాంటి నాయకుడిని ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లా నాయకుల సమావేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకున్న పార్టీ అధినేత బొత్సను అభ్యర్థిగా ప్రకటించారు.

- విద్యార్థి నాయకుడి నుంచి మంత్రిగా ఎదిగిన నాయకుడు
- వైఎస్సార్, జగన్ క్యాబినెట్లలో మంత్రిగా తనదైన ముద్ర

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర రాజకీయాల్లో బొత్స సత్యనారాయణ సీనియర్ రాజకీయ నాయకుడు. బలమైన ప్రజా మద్దతుతో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఎలాంటి వివాదాన్నయినా సామరస్యంగా పరిష్కరించగల నేతగా పేరు. విశాఖ అభివృద్ధి కోసం.. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న యూనియన్ సంఘాలకు తన మద్దతు పలికారు. అంతేకాకుండా తన సతీమణి ఎంపీగా ఉన్న సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ గురించి ఆనాడు పార్లమెంట్‌లో గళం వినిపించేలా చేశారు. గాజువాక అల్లుడిగా ఈ ప్రాంతంతో మరింత అనుబంధం బొత్స సత్యనారాయణకు ఉంది.

విద్యార్థి నాయకుడి నుంచి మంత్రిగా..

విజయనగరంలో బొత్స గురునాయుడు, ఈశ్వరమ్మ దంపతులకు 1958లో బొత్స సత్యనారాయణ జన్మించారు. ఆయన మహారాజా కళాశాలలో బీఏ డిగ్రీ పూర్తి చేశారు. ఆయన 1985లో బొత్స ఝాన్సీలక్ష్మీని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. అబ్బాయి సందీప్, అమ్మాయి అనూష. రాజకీయ జీవితం విద్యార్థి దశ నుంచే ప్రారంభమైంది. 1978లో విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చి అంచలంచెలుగా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ లీడర్‌గా ఎదిగారు. ఆయన 1992 నుంచి 99 వరకు రెండుసార్లు విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా పనిచేశారు. 1999లో బొబ్బిలి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఆనాడు ఎన్డీయే హవా వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి కేవలం ఐదుగురు ఎంపీలే గెలవగా అందులో బొత్స ఒకరు. 2004, 2009లలో చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రధాన అనుచరుడిగా ఆయనకు పేరుంది. ఆయన వైఎస్సార్, రోశయ్య , కిరణ్ కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతర పరిణామాలతో 2014లో ఓడిపోయారు. దీంతో 2015లో కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన బొత్స సత్యనారాయణ తన మద్దతుదారులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. 2019 చీపురుపల్లి నియోజకవర్గం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్యాబినెట్‌లో పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా కూడా ఆయన పనిచేశారు.

ఎమ్మెల్సీ స్థానం వైఎస్సార్‌సీపీదే..



నక్కపల్లిలో ఎంపీటీసీలను పరిచయం చేసుకుంటున్న బొత్స సత్యనారాయణ, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు

- బొత్సకు పార్టీ జిల్లా నాయకుల స్వాగతం

నక్కపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఖాళీ అయిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన అనంతరం తిరుగు ప్రయాణంలో నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఆగారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు బొత్సకు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయం వద్ద ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొత్సను వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వీసం రామకృష్ణ మండలంలో ఉన్న ఎంపీటీసీ సభ్యులను బొత్సకు పరిచయం చేశారు. అనంతరం బొత్స సాక్షితో మాట్లాడుతూ సంఖ్యాబలం ప్రకారం ఎమ్మెల్సీ స్థానం వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. తమ పార్టీకి దాదాపు 615కు పైగా సంఖ్యాబలం ఉందన్నారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. బొత్సకు స్వాగతం పలికిన వారిలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీలు తిరుపతిరావు, తోట సత్తిబాబు, గొర్ల గోవిందు, నిట్ల గోవిందు, కొల్నాటి బుజ్జి, సర్పంచ్‌లు భార్గవ్, సాదిరెడ్డి శ్రీను, వెదుళ్ల రమణ, నాయకులు ఎల్లేటి సత్తిబాబు, అల్లాడ కొండ, ముద్దా శ్రీను, వీసం రాజు తదితరులు ఉన్నారు.

గంజాయి కేసుల్లో యువతే ప్రధాన ముద్దాయిలు

- వేర్వేరు చోట్ల 246 కేజీల గంజాయి స్వాధీనం
- విలువ సుమారు రూ.12.30 లక్షలు
- ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు
- ఎస్పీ దీపిక వివరాలు వెల్లడి



పట్టుకున్న గంజాయి బస్తాలు, ముద్దాయిలతో ఎస్పీ దీపిక, పోలీస్ సిబ్బంది

అనకాపల్లి: రావికమతం, చీడికాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రవాణా చేస్తున్న 246 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గంజాయి విలువ సుమారు రూ.12.30 లక్షలు ఉంటుందని ఆమె తెలిపారు. గంజాయి రవాణాలో పట్టుబడిన ఈకోస్టార్ పాసింజర్ వాహనం, ఒక ఆటో, ఒక మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రధాన రవాణా మార్గాల వద్ద ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామని, గంజాయి రవాణాను పూర్తిగా అరికడతామన్నారు. ఈ కేసుల్లో ఎక్కువగా యువత ముద్దాయిలుగా పట్టుబడుతున్నారని ఆమె చెప్పారు.

రావికమతం పోలీస్‌స్టేషన్ పరిధిలో...

రావికమతం మండలం కవ్వగుంట గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కృష్ణా జిల్లా పేరుములూరు మండలం గంగూరు గ్రామానికి చెందిన ఈకోస్టార్ పాసింజర్ వ్యాన్ డ్రైవర్ పురంశెట్టి సత్యనారాయణను అదుపులోకి తీసుకుని 96 కేజీల (విలువ సుమారు రూ.4.80 లక్షలు) గంజాయితోపాటు, రెండు సెల్‌ఫోన్లు, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు.

చీడికాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో...

అజ్ఞాత వ్యక్తుల సమాచారం మేరకు చీడికాడ మండలం మందాల గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక ఆటో, ద్విచక్రవాహనంలో 150 కేజీల (విలువ సుమారు రూ.7.50 లక్షలు) గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు లభించాయని, నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు ఆమె చెప్పారు. ఈ కేసులో అల్లూరి జిల్లా పాడేరు మండలం సలుగు పంచాయతీ కక్కి గ్రామానికి చెందిన శోభ శ్రీను, వంట్ల మామిడి పంచాయతీ పులబంద గ్రామానికి చెందిన వేమల ఈశ్వరరావు, అదే గ్రామానికి చెందిన కొర్ర కొండబాబు, హకుంపేట మండలం దుర్గం గ్రామానికి చెందిన పాత్రుని దిలీప్‌కుమార్‌పై కేసులు నమోదు చేశామని చెప్పారు. ఐదుగురు ముద్దాయిలను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్పీ తెలిపారు. గంజాయి రవాణా కేసుల్లో ప్రతిభ కనబర్చిన రావికమతం ఎస్‌ఐ జి.ధనుంజయనాయుడు, చీడికాడ ఎస్‌ఐ జి.నారాయణరావుతో పాటు సిబ్బందిని ప్రశంసాపత్రాలతో ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.అప్పలనాయుడు, సీఐలు బి.సిహెచ్.స్వామినాయుడు, ఎల్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

14న గాంధీధాం-పూరీ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ): పలు డివిజన్ల పరిధిలో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు దారి మళ్లిస్తున్నట్లు, మరికొన్ని రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ తెలిపారు. 14న గాంధీధాం-పూరీ (22973) ఎక్స్‌ప్రెస్, 17న పూరీ-గాంధీధాం (22974) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

- ఈ నెల 1, 8, 10, 13, 15, 17, 20, 22, 24, 27, 29వ తేదీల్లో అలప్పుజ-ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్, ఎర్నాకుళం-టాటానగర్ (18190) ఎక్స్‌ప్రెస్ వయా పొదనూర్, కొయంబత్తూర్, ఇరుగూర్ మీదుగా నడుస్తాయి.
- 6, 10, 11, 13, 14, 15, 18వ తేదీల్లో విశాఖపట్నం-నిజాముద్దీన్ (12807) సమతా ఎక్స్‌ప్రెస్ విజయవాడ, బల్హార్షా, నాగ్‌పూర్ మీదుగా నడుస్తుంది.
- 8, 12, 13, 15, 16, 17, 20వ తేదీల్లో నిజాముద్దీన్-విశాఖపట్నం (12808) సమతా ఎక్స్‌ప్రెస్ నాగ్‌పూర్, బల్హారాష, విజయవాడ మీదుగా నడుస్తుంది.
- 18న విశాఖపట్నం-ఎల్టీటీ(22847) ఎక్స్‌ప్రెస్ విజయవాడ, బల్హార్షా, నాగ్‌పూర్ మీదుగా నడుస్తుంది.
- 20న ఎల్టీటీ-విశాఖపట్నం (22848) ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, బల్హార్ష, విజయవాడ మీదుగా నడుస్తుంది.

న్యూస్‌రీల్


రైవాడ జలాశయం నీరు విడుదల



రైవాడ కాలువ నుంచి ప్రవహిస్తున్న నీరు

దేవరాపల్లి: ఖరీఫ్ సాగుకు రైవాడ జలాశయం నుంచి శుక్రవారం సాగునీటిని విడుదల చేశారు. ఆయకట్టు రైతులతో కలిసి ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైవాడ జలాశయం కుడి, ఎడమ కాలువల నుంచి 150 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. ఎడమ కాలువ నుంచి 100 క్యూసెక్కులు, కుడి కాలువ నుంచి 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రైతుల అవసరం మేరకు నీటి విడుదల పెంచడం లేదా తగ్గించడం చేస్తామని డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 108.60 మీటర్లుగా ఉందన్నారు.

శరవేగంగా విజయవాడ-విశాఖ ట్రాక్ పనులు



అనకాపల్లి స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏడీఆర్‌ఎం

అనకాపల్లి: అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో వివిధ విభాగాలను విజయవాడ నుంచి వచ్చిన డివిజనల్ ఏడీఆర్‌ఎం ఎస్.శ్రీనివాసరావు కొండ శుక్రవారం పరిశీలించారు. విజయవాడ నుంచి విశాఖ రైల్వే ట్రాక్ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని, ఈ కారణంగా ఈ మార్గంలో కొన్ని రైళ్లు నిలుపుదల చేశామని చెప్పారు. ఈనెల 10న నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రైళ్లు పునరుద్ధరిస్తున్నట్టు చెప్పారు. స్టేషన్ మేనేజర్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అధికార పార్టీకి వర్తించదా..?



వెంకటరాజుపురం ప్రధాన రహదారిలో ఉన్న టీడీపీ ఫ్లెక్సీ



తెనుగుపూడి ప్రధాన కూడలిలో ఉన్న జనసేన ఫ్లెక్సీ

దేవరాపల్లి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి నాలుగు రోజులు దాటినా ఎన్నికల నియమావళిని అధికారులు సక్రమంగా పాటించడం లేదు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే గ్రామాలలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. దేవరాపల్లి మండలంలోని వెంకటరాజుపురం, తెనుగుపూడి తదితర గ్రామాలలో టీడీపీ, జనసేన ఫ్లెక్సీలు రోడ్లకు ఆనుకొని ఉన్నా అధికార్లు మాత్రం అటుగా కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రధాన రహదారిలో ఉన్న ఫ్లెక్సీలనైనా తొలగించకపోవడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు ఎన్నికల హామీలపై పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

దాబాగార్డెన్స్ (విశాఖ): చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలపై పోరాటాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయాల్సిందేనన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. విశాఖలో శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సర్వసభ్య సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. 4న మదనపల్లెలో సీపీఐ రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. సీపీఐ శతాబ్ది వేడుకలు డిసెంబర్ 26 ప్రారంభమై ఏడాది పాటు జరుగుతాయన్నారు. ఇండియా కూటమి బీజేపీకి గట్టిపోటీ ఇచ్చిందన్నారు. గత పదేళ్ల పాలనలో ప్రభుత్వ వ్యవస్థలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బీజేపీ వ్యతిరేకులపై ఈడీ, ఐటీ, సీబీఐలను ప్రయోగించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడాన్ని సీపీఐ ఖండిస్తోందన్నారు.సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఏజే స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎ.విమల, ఎం.మన్మథరావు, జి.రాంబాబు, కె.సత్యాంజనేయ, ఆర్ శ్రీనివాసరావు, ఎస్‌కే రహ్మాన్, పి.చంద్రశేఖర్, జీఎస్‌జే అచ్యుతరావు, సీఎన్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి కేసులకు ప్రత్యేక కోర్టు

- స్పీకర్‌ను కోరిన న్యాయవాదులు



స్పీకర్ అయ్యన్నపాత్రుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ ప్రతినిధులు

నర్సీపట్నం: గంజాయి కేసులకు నర్సీపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని శుక్రవారం వారు మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. నర్సీపట్నంలో జిల్లా స్థాయి బెంచ్ ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాలను విస్తరించాలని కోరారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ మెట్టా ప్రభాకర్, కార్యదర్శి అనిమిరెడ్డి శివకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కోసూరి అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు పొక్కునూరు నరసింహం, కామిరెడ్డి అప్పలనాయుడు, రుత్తల అప్పారావు, కామిరెడ్డి సత్యనారాయణ, అనిమిరెడ్డి గోవిందరావు, లోకాలోవరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో ఫ్లెక్సీ వార్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు టీడీపీలో అంతర్గత వర్గపోరు ఫ్లెక్సీల చించివేతలతో బయటపడింది. గురువారం రాత్రి నుంచి అంబేడ్కర్ కూడలిలో ఒకరు వేసిన ఫ్లెక్సీని మరొకరు కట్ చేస్తుండడంతో విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఇటీవల ఎంపీ భరత్ పుట్టినరోజు సందర్భంగా వార్డుకు చెందిన గరే సదానంద్ ఫ్లెక్సీ వేసి అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేశారు. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీకి వెళ్లిన కొప్పల రమేష్ దంపతుల ఫొటోలను అందులో వేయలేదు. ఇది వార్డు అధ్యక్షుడు తమ్మిన సూరిబాబుకు ఆగ్రహం తెప్పించింది. తన వర్గానికి చెందిన వెంకటేష్ అనే యువకుడితో ఫ్లెక్సీని కట్ చేయించి వాళ్ల అనుచరుల ఫొటోలతో వేసిన ఫ్లెక్సీని అక్కడ ఉంచారు. దీంతో సదానంద్ తన అనుచరులతో సూరిబాబు వర్గం వేసిన ఫ్లెక్సీని పాక్షికంగా కట్ చేసి ఇంటి వద్ద పాత ఫ్లెక్సీని తీసుకువచ్చి వారికి సవాల్ విసిరారు. కారణాలేవైనా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కోరాడ రాజబాబు వర్గాలుగా వీరు పనిచేస్తున్నట్టు మిగిలిన టీడీపీ నాయకులు మాట్లాడుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఫ్లెక్సీ వార్ నడుస్తూ మార్చి మార్చి పోటీగా పెడుతున్నారు. వీటిని జీవీఎంసీ అధికారులు తొలగించాల్సి ఉండగా.. చోద్యం చూస్తుండటం గమనార్హం

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

- విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్
- జాతీయ తైక్వాండో పోటీలు ప్రారంభం
- హాజరైన 671 మంది క్రీడాకారులు



తలపడుతున్న క్రీడాకారులు



పోటీలకు హాజరైన పలు రాష్ట్రాల తైక్వాండో క్రీడాకారులు



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ స్పోర్ట్స్: జాతీయ 7వ క్యాడెట్ కోరుగి పూమ్‌సే తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభయ్యాయి. పోర్ట్ ట్రస్ట్ డైమెండ్ జూబ్లీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం తైక్వాండో క్రీడాకారుల నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ వేదికగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం చక్కటి పరిణామమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, ప్రతిభా పాటవాలతో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. తొలుత ఏపీ తైక్వాండో అధ్యక్షుడు హర్షవర్ధన్ అతిథులను ఆహ్వానించగా.. ఫిమేల్ క్యాడెట్ పోటీలను విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, మేల్ క్యాడెట్ పోటీలను విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్ర సర్వీసెస్ నుంచి 671 మంది క్రీడాకారులు పోటీపడుతున్నట్లు హర్షవర్ధన్ తెలిపారు. 45 మంది రిఫరీలు, దేశ నలుమూలల నుంచి 20 మంది అంతర్జాతీయ, మరికొంత మంది గ్రేడ్ క్వాలిఫైడ్ రిఫరీలతో పూర్తి పారదర్శకంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా వినియోగించే అన్ని వసతులు, నియమ నిబంధనలతో పోటీలు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో తైక్వాండో సమాఖ్య కోశాధికారి జస్బీర్‌సింగ్, టోర్నీ పరిశీలకుడు దొరై, వీఎంఆర్డీఏ ప్లానింగ్ అధికారి కె.వెంకటేశ్వరరావు, సంఘం ప్రతినిధులు డి.వి.చారి, లక్ష్మీనారాయణ, గణేష్, మురళీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు విజేతలు వీరే..

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆరు కోర్టుల్లో మ్యాట్స్‌పై బౌట్స్ జరుగుతున్నాయి. పోటీల్లో సర్వీసెస్‌తో పాటు చండీగఢ్, బిహార్‌కు చెందిన క్రీడాకారులు తొలిరోజు పోటీల్లో స్వర్ణాలందుకున్నారు. తొలిరోజు క్యాడెట్ మేల్ 180+లో ఆర్మన్‌సింగ్(ఎస్ఎస్‌సీబీ) విజేతగా నిలిచి స్వర్ణం అందుకోగా ఉత్కర్ష్(ఢిల్లీ) రజతం, శుభమ్‌ధార్(రాజస్థాన్), అభినవ్ వర్మ(మధ్యప్రదేశ్) కాంస్యాలను అందుకున్నారు. క్యాడెట్ మేల్–160లో తార్ నికమ్(అరుణాచల్‌ప్రదేశ్) విజేతగా నిలిచి స్వర్ణం అందుకోగా రమిత్(కర్ణాటక) రజతం, రోహిత్ సజని(బిహార్), నహక్పమ్(ఎస్ఎస్‌సీబీ) కాంస్యాలందుకున్నారు. క్యాడెట్ మేల్–172లో హిమాంశుకుమార్(బిహార్) విజేతగా నిలవగా ఆదిత్య శ్రీవాస్తవ(మిజోరం) రజతం, పునీత్(ఎస్ఎస్‌సీబీ), వంశ్ సుధీర్(ఉత్తరప్రదేశ్) కాంస్యాలందుకున్నారు.

రుషికొండ బీచ్‌లో షూటింగ్ సందడి



లొకేషన్‌లో హీరో ప్రియదర్శి

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు, రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద శుక్రవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. దర్శకుడు ఇంద్రగంటి మోహన్ కృష్ణ తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించి హీరో ప్రియదర్శి, నటుడు, దర్శకుడు తనికెళ్ల భరణి, వెన్నెల కిశోర్‌పై పలు సన్నివేశాలను చిత్రీకరించారు.

7న మహిళా కళాశాల అధ్యాపక పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల(అటానమస్)లో ఖాళీగా ఉన్న పీజీ అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 7న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజులా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కామర్స్–2, కెమిస్ట్రీ–2, ఇంగ్లిష్–1, బోటనీ–1, గణితం–2, కంప్యూటర్ సైన్స్–2, మైక్రోబయాలజీ–2, ఫిజిక్స్–1, ఎకనామిక్స్–1 చొప్పున అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు తమ వివరాలను visakhawomen@gmail.comకు మెయిల్ చేసి.. ఆ రోజు ఇంటర్వ్యూకి హాజరు కావాలని కోరారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాకే పనులు

- ఏపీఐఐసీ అధికారులకు తేల్చిచెప్పిన నిర్వాసితులు
- కారిడార్ భూములు పరిశీలించిన నర్సీపట్నం ఆర్డీవో జయరాం



కారిడార్ భూములు పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

నక్కపల్లి: తమకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీతోపాటు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించిన తర్వాతే ప్రభుత్వం భూములు స్వాధీనం చేసుకొని, పనులు మొదలు పెట్టాలని పలువురు రైతులు, నిర్వాసితులు తేల్చిచెప్పారు. ఈ విషయమై గత నెల 30న హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్‌ల దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం ఏపీఐఐసీ వారు సేకరించిన భూములను నర్సీపట్నం ఆర్డీవో జయరాం శుక్రవారం పరిశీలించారు. మండలంలోని అమలాపురం, చందనాడ, మూలపర, రాజయ్యపేట తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు.

పలు సమస్యలతోపాటు డిమాండ్లను పరిహారం విషయంలో జరిగిన అన్యాయాన్ని ఈ సందర్భంగా పలువురు రైతులు వివరించారు. తమ నుంచి భూములు సేకరించి పదేళ్లకు పైనే అయిందన్నారు. భూసేకరణ సమయంలో 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించడానికి వచ్చిన ఏపీఐఐసీ అధికారులను అడ్డుకున్నామన్నారు. పూర్తి ప్యాకేజీ, పరిహారం చెల్లించకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని రైతులు చేసిన ఆందోళనకు అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నేతలు కూడా సంఘీభావం ప్రకటించారని ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చిందని, గతంలో ప్రకటించిన విధంగా నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లించాలని కోరారు. అప్పటి వరకు పనులు ప్రారంభించడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. డీ ఫారం రైతులకు, ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న వారికి పరిహారం చెల్లింపుల్లో ఇబ్బందులు ఉన్నాయని, చాలా మందికి పరిహారం అందలేదన్నారు.

దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ ఈ ప్రాంత నిర్వాసితుల సమస్యలను, డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ సత్యనారాయణ, సర్వేయర్లు, టీడీపీ మండలాధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకర్రావు, ఉప సర్పంచ్ గబ్బర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షలు మానుకోవాలి



పార్టీ నాయకులతో కలిసి సంఘటన స్థలంలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

- మున్సిపల్ అధికారుల తీరు సరైంది కాదు
- కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: రాజకీయ కక్షలతో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ 26వ వార్డు పార్టీ ఇన్‌చార్జి చిటికెల కరుణాకర్ భవనాన్ని కూలగొట్టేందుకు మున్సిపల్ అధికారులు, పోలీసులు సిద్ధమవుతున్నారన్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్, న్యాయవాది మాకిరెడ్డి బుల్లిదొర, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, ఇతర పార్టీ నాయకులు కరుణాకర్ భవనం వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు పార్టీ నాయకులు అక్కడే వేచి ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు, పోలీసులు రాలేదు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి, అధికారులను ఉసిగొలిపి ఆస్తులను ధ్వంసం చేయాలని చూడటం ముమ్మాటికీ రాజకీయ కక్ష అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో రాష్ట్రంలో ఎక్కడబడితే అక్కడ దాడులు జరుగుతున్నాయన్నారు.

రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో రాజకీయ కక్షలను ప్రేరేపించటం మంచి పద్ధతి కాదన్నారు. కరుణాకర్ కోర్టును ఆశ్రయించడంతో తొందరపడి భవనాన్ని కూల్చవద్దని హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు. భవన యజమాని వివరణ ఇచ్చినప్పటికీ, మున్సిపల్ అధికారులు మూడు రోజుల వ్యవధిలోనే రెండో నోటీసు ఇవ్వటం దారుణమన్నారు. తమ దగ్గర ఉన్న ఆధారాలను అధికారులకు చూపించేందుకు సంఘటన స్థలానికి రావటం జరిగిందన్నారు. అధికారులు ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆయన వెంట చింతకాయల వరుణ్, కర్రి శ్రీనివాసరావు, లాలం అప్పారావు, యాదగిరి శేషు, తమరాన శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, లగుడు స్వామి, శారద, లలిత, బేతిరెడ్డి విజయ్, పార్టీ నాయకులు ఉన్నారు.

వచ్చే నెల నుంచి కోరుప్రోలులో పింఛన్ పంపిణీ

- గిరిజన గ్రామాన్ని సందర్శించిన డీఆర్డీఏ పీడీ శచీదేవి
- ఆదివాసీల సమస్యలపై కలెక్టర్‌కు నివేదిస్తా



కోరుప్రోలు ఆదివాసీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డీఆర్డీఏ పీడీ శచీదేవి

రోలుగుంట: కొరుప్రోలు గ్రామంలో వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు పింఛన్ ఇస్తామని, ఎవరూ కిందకు దిగువకు రావొద్దని డీఆర్డీఏ పీడీ శచీదేవి స్పష్టం చేశారు. మండలంలోని ఎం.కె.పట్నం శివారు కొరుప్రోలు గ్రామ ఆదివాసీల సమస్యలపై శుక్రవారం పలు పత్రికల్లో వెలువడిన వార్తలు, సాక్షి దినపత్రికలో వలంటీర్ పోయే...డోలీ వచ్చే అనే ఫొటో ఫీచర్‌పై అధికారులు స్పందించారు. ఈ మేరకు కోరుప్రోలు గ్రామాన్ని డీఆర్డీఏ పీడీ శుక్రవారం సందర్శించారు. అక్కడ ఆదివాసీలను కలిసి వారి సమస్యలపై ఆరా తీశారు. ఈ క్రమంలో కొండ శివారు తొమ్మిది కొండు ఆదివాసీ కుటుంబాలు కొరుప్రోలులో జీవనం సాగిస్తున్నాయని, తమ ఆరోగ్యాలు బాగులేక పోయినా.. పింఛన్, వైద్యం కోసం రహదారి సరిగా లేక డోలీపై దిగువకు ఒక పక్క మూడు కిలోమీటర్లు ఇక్కట్లు పడుతూ వెళ్తున్నామని బరువు బొజ్జల కొండబాబు, గిమ్మిల అప్పారావు, దివ్యాంగ లబ్ధిదారుడు గిన్నెల ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏ అధికారి తమ వద్దకు వచ్చి సమస్య తెలుసుకునే పరిస్థితి లేదన్నారు. ప్రధానంగా రహదారి కోసం కలెక్టరుకు గతంలో పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. గ్రామానికి వచ్చే పూర్వపు తోవను రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు కొనుగోలు చేసి గేటు అడ్డుగా వేసి అంతరాయం కలిగించారన్నారు. వీరి సమస్యలపై పీడీ స్పందించారు. ప్రధాన సమస్య రహదారి ఏర్పాటు కోసం కలెక్టర్ విజయ కృష్ణన్‌కు నివేదిస్తామని భరోసా ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్, సీఐటీయూ జిల్లా నాయకుడు గోవింద, గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు గెమ్మిలి సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన ఏపీ పేరెంట్స్ కమిటీ



కొక్కిరాపల్లి గురుకులంలో విద్యార్థినులకు బహుమతులు ఇస్తున్న పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

యలమంచిలి రూరల్: మండలంలోని కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులాన్ని ఆంధ్రప్రదేశ్ పేరెంట్ అసోసియేషన్ (ఏపీపీఏ) కమిటీ శుక్రవారం సందర్శించింది. ఇక్కడ ఐదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకూ 2023–24 సంవత్సరంలో అధిక మార్కులు సాధించిన బాలికలకు బహుమతులు ప్రదానం చేసింది. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గురుకులం విద్యార్థినుల ప్రతిభ ఉందని కమిటీ సభ్యులు అన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య గురుకులాల ద్వారా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. విద్యార్థినులంతా బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వాతంత్య్ర సమరయోధుడు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురుకులం ప్రిన్సిపాల్‌ఎం మాణిక్యంను అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పేరెంట్ అసోసియేషన్ (ఏపీపీఏ) కమిటీ వ్యవస్థాపకుడు పిల్లా చంద్రం, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పి. రాము, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వై. పాండురంగ, విద్యార్థినుల తల్లిదండ్రులు, గురుకులం బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆకులతో ఉపాధి కూలీల వినూత్న నిరసన

- ఉపాధి పనుల బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్



అరచేతిలో ఆకులు పట్టుకుని నిరసన తెలుపుతున్న శంకర గ్రామ ఉపాధి కూలీలు, సీపీఎం నేత వెంకన్న

మాడుగుల రూరల్: మాకు తిండి అయినా పెట్టండి, ఉపాధి హామీ పనుల బిల్లులయినా చెల్లించాలని వేతనదారులు అరచేతిలో ఆకులు పట్టుకుని వినూత్న రీతిలో తమ నిరసన వ్యక్తం చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని శంకరంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షురాలు కె. భవానీ, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన్‌బాబు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులకు సంబంధించి 129 కోట్ల 23 లక్షల 47 వేల 371 రూపాయల పెండింగ్ బిల్లులు కూలీలకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పనులు చేస్తున్న సమయంలో ప్రతి 15 రోజులకొకసారి చెల్లించాలన్నారు. పనులు నిలుపుదల చేస్తే నాలుగు నుంచి ఆరు వారాలు లోపు బిల్లులు చెల్లించాలన్నారు. అయితే రెండు నెలలకుపైగా దాటినా చెల్లించలేదన్నారు. ఒక్క మాడుగుల మండలంలో 7 కోట్ల 19 లక్షల 78 వేల 483 రుపాయలు చెల్లించాల్సి ఉందన్నారు.

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కోత విధించిందన్నారు. ఈ ఏడాది రూ.86 కోట్లకు కుదించి కూలీలు ఉసురు పోసుకుందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉండి బిల్లులు రాబట్టక పోవడం శోచనీయమన్నారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని, అన్ని రకాలు అలవెన్సు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉపాధి బిల్లులు చెల్లించకపోతే ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు మత్స్యరాజు దాసు అప్పారావు, అప్పరాజు, స్వామి, సింహాచలం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మహారాణిపేట, అక్కిరెడ్డిపాలెం, గోపాలపట్నం: నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం నిల్వలపై పౌర సరఫరాల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. రైల్వే న్యూకాలనీలో ఎస్ఎస్‌వీ క్యాటరింగ్‌లో 220 కిలో ల బియ్యం, పాత పరదేశిపాలెం, మధురవాడ ఏరియాల్లో అనధికార గోదాముల్లో 750 కిలోల బియ్యం నిల్వలను గుర్తించారు. నాతయ్యపాలెంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 300 కిలోల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని ఈ సంస్థలపై 6ఎ కేసు నమోదు చేశారు. నగరంలో 1 టౌన్ నుంచి సబ్బవరానికి 3 వ్యాన్లలో మూడు టన్నుల రేషన్ బియ్యం తరలిస్తుండగా టాస్క్ ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు కాకానినగర్ వద్ద తనిఖీలు చేసి పట్టుకున్నారు. గోపాలపట్నంకు చెందిన చిలకపల్లి శ్రీను, చిలకపల్లిరాంబాబు, యలమంచిలి మంగరావులను అదుపులోకి తీసుకున్నారు. పౌర సరఫరాల ఆర్ఐ సతీష్, డిప్యూటీ తహసీల్దార్ చైతన్య ఆధ్వర్యంలో బియ్యాన్ని పౌరసరఫరాల గోదాముకు తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పద్మనాభం: విజయానందపురంలో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో గడ్డి నివారణ మందు తాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన పాలెపు అప్పలరాజు(56) కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. వీటికి తాళలేక ఈ నెల ఒకటో తేదీన గడ్డి నివారణకు ఉపయోగించే మందు తాగాడు. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఆయన విజయనగరం అరుణా జ్యూట్ మిల్లు సమీపంలోని కార్ల షోరూంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహిమ గల కాయిన్ అంటూ బురిడీ

- మోసపోయామని తెలుసుకుని నారాయణరావును బంధించిన బాధితులు
- తనను బంధించినట్లు అశ్వారావుపేటలో ఉన్న కుమారుడికి నారాయణరావు ఫోన్
- అతడి ఫిర్యాదుతో మోసం బట్టబయలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న గోపాలపట్నం పోలీసులు



పూజలు చేసిన రాగి కాయిన్ ఇదే

గోపాలపట్నం: మహిమ గల కాయిన్ అంటూ మోసం చేసిన ఓ వ్యక్తిని బాధితులు నిర్బంధించి డబ్బులు డిమాండ్ చేయడం స్థానికంగా సంచలనం రేపింది. గోపాలపట్నం సీఐ సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన అన్వేష్ ద్వారా తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కొత్తగూడెం అశ్వారావుపేటకు చెందిన గుత్తల నారాయణరావుతో కొత్తపాలేనికి చెందిన అయితంశెట్టి తాతయ్యలు, అంజంతా పార్క్‌కు చెందిన అజయ్, గోపాలపట్నానికి చెందిన మనోజ్, పవన్‌లకు పరిచయం ఏర్పడింది. తన వద్ద రాజుల కాలం నాటి రాగి కాయిన్ ఉందని, దానికి అద్భుత శక్తులు వచ్చేలా చేస్తానని నారాయణరావు నమ్మబలికాడు. దీనికి కొంత ఖర్చు అవుతుందని నమ్మబలికి రూ.1.70 లక్షలు వసూలు చేశాడు. ఆ మేరకు ప్రహ్లాదపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గదిని అద్దెకు తీసుకుని రాగి కాయిన్ రసాయనాలు కలిపి శక్తులు తెప్పించేందుకు గత నెలలో పూజలు ప్రారంభించారు. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో నారాయణరావు వెళ్లిపోవడానికి ప్రయత్నించాడు. కాయిన్‌ను శక్తులు అయినా తెప్పించాలి లేదా రూ.1.70 లక్షలైనా ఇవ్వాలని డిమాండ్ చూస్తూ నారాయణరావును అజయ్, తాతయ్యబాబు, మనోజ్, పవన్ బంధించారు. మూడు రోజుల క్రితం నారాయణరావు అశ్వారావుపేటలో ఉన్న తన కుమారుడు సాయికుమార్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో సాయి కుమార్ ఇక్కడికి వచ్చి గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన గోపాలపట్నం పోలీసులు ఫోన్ కాల్ సిగ్నల్ ఆధారంగా కిడ్నాప్ వ్యవహారాన్ని ఛేదించారు. నలుగురు నిందితుల్ని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి మధ్య ఏవిధమైన ఒప్పందాలు జరిగాయి. ఎవరెవరి పాత్ర ఎంత ఉందన్న విషయాలపై పోలీసులు విచారిస్తున్నారు. మహిమ గల కాయిన్లు అంటూ ఏవీ లేవని, ఎవరు చెప్పినా మోసపోవద్దని సీఐ సురేష్ సూచించారు. పోగొట్టుకున్న డబ్బుల కోసం ఇలా కిడ్నాప్ చేయడం, బంధించడం నేరాలకు కిందకు వస్తుందని హెచ్చరించారు.

క్లుప్తంగా

రాజకీయ కక్షతోనే నోటీసులు

కశింకోట: మండలంలోని బయ్యవరంలో చెరువు వద్ద వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడు గొల్లవిల్లి బాబూరావు స్వీట్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుండగా ఆయన పొట్టకొట్టేందుకు టీడీపీ నాయకులు యత్నిస్తున్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. దుకాణం తొలగించాలని రెవెన్యూ అధికారులతో నోటీసులు ఇప్పించారని తెలిపారు. రాజకీయంగా కక్ష కట్టి ఇలా ప్రవర్తించడం శోచనీయమన్నారు. ఇటువంటి సంస్కృతి ఇక్కడ గతంలో ఎన్నడూ లేదని, ఇటువంటి విధానాలు మానుకోవాలని హితవు పలికారు.

నలుగురు జూదరులపై కేసు నమోదు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పార్కు సెంటర్ వద్ద జూదం ఆడుతున్న నలుగురి వద్ద నుంచి రూ.11,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

నేడు సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి: స్థానిక గవరపాలెంలోగల సత్తమ్మ తల్లి అమ్మవారి ఆలయ 33వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆడారి అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్లవారు జామునుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

రెండు లీటర్ల సారా స్వాధీనం

కశింకోట: మండలంలోని కొత్తపల్లిలో ఓ ఇంటి వద్ద విక్రయిస్తున్న రెండు లీటర్ల నాటు సారాను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్ఐ కె. రమణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా గొంతిన రాజును అరెస్టు చేశామని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

నాతవరం: నిబంధనల ప్రకారమే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ ఉండాలని ఎంపీడీవో జాగరల రాంబాబు అన్నారు. వల్సంపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి స్టాకుతోపాటు చిన్నారులు వివరాలను అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నా. మెనూ విధిగా అమలు చేయాలని, నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే చర్యలు ఉంటాయన్నారు. తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా ఈ వారం అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించాలని సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 25 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	---	---
మూడోరకం	3,100	3,300

అనకాపల్లి సినిమాలు

శివం భజే	:	రాజా
కల్కి 2898ఏడీ	:	సత్యనారాయణ స్క్రీన్-1
బుడ్డీ	:	సత్యనారాయణ స్క్రీన్-2
అలనాటి రామచంద్రుడు	:	పర్తిసాయి
డార్లింగ్	:	షిర్డిసాయి
తిరగబడరస్వామి	:	వెంకటేశ్వర
విరాజి	:	శ్రీసత్య
ఉషాపరిణయం	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-7 యూనిట్లు, బి పాజిటివ్-14 యూనిట్లు, ఒ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

రేషన్ సరకుల్లోనూ కోతలే

- బియ్యంతో సరిపెడుతున్న ప్రభుత్వం
- ఈనెలలోనూ అందని కందిపప్పు, పంచదార



కశింకోటలో అందజేస్తున్న రేషన్ బియ్యం

కశింకోట: కూటమి ప్రభుత్వంలో అన్ని హామీల్లోనూ కోతలు మొదలయ్యాయి. ఇప్పటికే పింఛన్ల లబ్ధిదారులను తగ్గిస్తున్న ప్రభుత్వం, మరో వైపు రేషన్ సరకుల్లోను కోత విధిస్తోంది. బియ్యం, పంచదార, కందిపప్పు, వంటనూనె, గోధుమపిండి, రాగిపిండి.. ఇలా అన్ని రకాల వస్తువులు అందిస్తామని గొప్పలు చెప్పుకున్న కూటమి నేతలు ఆగస్టు నెలలో కూడా బియ్యంతో సరిపెట్టారు. పంచదార, గోధమపిండి, రాగులు ఇవ్వకుండా చేతులెత్తేశారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి .. అధికారం చేజిక్కించుకున్న తర్వాత పేదల కడుపు మాడ్చుతున్నారు. ఈసారి కూడా కందిపప్పు, గోధుమపిండి, వంటనూనె కేటాయింపులే లేకుండా చేశారు. కేవలం బియ్యం మాత్రమే పంపిణీ ప్రారంభించారు. అనకాపల్లి నియోజకవర్గంలో 90 వేల బియ్యం కార్డులున్నాయి. దాదాపు అందరూ పేదలే. నిత్యావసర సరకుల ధరలు బహిరంగ మార్కెట్‌లో ఆకాశాన్ని అంటుతున్నాయి. రేషన్ షాపులద్వారా కూడా ఈ సరకులను అందజేయకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు.

పంచదార, కందిపప్పు ఇవ్వాలి



రేషన్ డిపోలో బియ్యం మాత్రమే కేవలం అందివ్వడం శోచనీయం. గతంలో వలే పంచదార, కంది పప్పు, ఇతర సరుకులను ఇవ్వాలి. వాటిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయడం ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ఎప్పటిలాగే బియ్యంతోపాటు మిగిలిన సరుకులు అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–కాటిపల్లి లక్ష్మి, కశింకోట

వెదజల్లే పద్ధతితో వరి సాగు లాభదాయకం



వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు రమణమూర్తి, ఉమామహేశ్వరరావు

తుమ్మపాల: నేరుగా విత్తే, వెదజల్లే పద్ధతులతో వరి సాగు లాభదాయకంగా ఉంటుందని, కూలీల ఖర్చు తగ్గుతుందని ప్రాంతీయ వ్యవసాయం పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రమణమూర్తి, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని తుమ్మపాలలో శుక్రవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరుగా విత్తుకొనే పద్ధతి వల్ల వరి సాగు సులభతరమవుతుందని చెప్పారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల వరినాట్లు సకాలంలో జరగక వరినారు ముదిరిపోయి దిగుబడులు తగ్గిపోతున్నాయని చెప్పారు. తుమ్మపాల గ్రామ రైతులు గత కొన్ని సంవత్సరాలుగా వరి సాగులో సీడ్ డ్రిల్, నేరుగా వరి విత్తనాలు వేసుకొని, వెదజల్లు, వరి విత్తనాలు కుచ్చులు పద్ధతి ఉపయోగించడం వల్ల మంచి దిగుబడులు సాధిస్తున్నారన్నారు. వరి నారు కట్టలు కట్టి, దమ్ము చేసి పొలంలో నాట్లు వేయడానికి ఎకరానికి సుమారు 30 మంది కూలీలు అవసరమవుతారని, కానీ కావలసినంత మంది కూలీలు సకాలంలో లభించక, ఎకరానికి సుమారు పదివేలు రూపాయలు ఖర్చు అవుతోందన్నారు. నేరుగా వరి విత్తుకునే పద్ధతి వల్ల ఖర్చు సగానికి పైగా తగ్గుతుందని, నాటిన 20 రోజులకు నామిని గోల్డ్ వంటి కలుపు మందులు ఉపయోగించి వరిలో కలుపు సమస్యని తగ్గించుకోవచ్చునన్నారు. తుమ్మపాలలోని రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 150 ఎకరాల్లో నేరుగా వరివిత్తే పద్ధతిని పాటిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మా రామకృష్ణ, రైతు నాయకులు పీలా మురళీ, పీలా జగదీశ్వరరావు, వేగి వెంకట కన్నప్పరావు ,గొర్లి మోదునాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



కశింకోట బాలికల పాఠశాలలో తల్లి పాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కశింకోట: స్థానిక బాలికల పాఠశాలలో గల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లి పాల ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఝాన్సీ ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లి పాలు శ్రేష్టమైనవన్నారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తప్పనిసరిగా శిశువుకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సంతోషి, శ్యామల, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మహిళ కడుపులో కణితి తొలగింపు



మహిళ కడుపులోంచి తొలగించిన కణితిని చూపుతున్న వైద్యుడు నారాయణరావు

అనకాపల్లి: రాంబిల్లి మండలం కట్టుబోలు గ్రామానికి చెందిన వెదుర్ల సంజీవి అనే మహిళ కడుపులో గల పెద్ద కణితిని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వద్ద గల ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో వైద్యుడు కె.కె.వి.ఎ.నారాయణరావు శుక్రవారం ఆపరేషన్ చేసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు వైద్యుల పర్యవేక్షణలో మూడు కిలోల బరువు గల కణితిని తొలగించినట్టు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ పోరాటంతో ఉపకులాలకు మేలు

అనకాపల్లి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 34 సంవత్సరాల పోరాటం ఫలితంగా దేశంలో 59 ఉపకులాలకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు అన్నారు. స్థానిక చదువులవారి వీధిలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభపరిణామమన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రకాశంజిల్లా ఈదురుపాకలో నలుగురు సభ్యులతో ప్రారంభమైందని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకించినప్పటికీ మోదీ తమ వంతు సహాయసహకారాలు అందించినట్లు ఆయన చెప్పారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఉపకులాలకు పూర్తి ఫలాలు అందుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో నిలిచిన పారిశుధ్య పనులు

- వేతనం తగ్గించడంతో విధులకు హాజరుకాని కార్మికులు
- గ్రామంలో పేరుకుపోయిన చెత్త



మెయిన్ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ఎస్.రాయవరం: మండలకేంద్రం ఎస్.రాయవరంలో పారిశుధ్య కార్మికులు రెండు రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. ఇటీవల కాంట్రాక్ట్ కార్మికులతో పారిశుధ్య పనులు నిర్వహణకు టెండరు ఖరారైంది. గత ఏడాది వేతనాలతో పోలిస్తే ఈసారి ఒక్కో కార్మికుడికి రూ.రెండు వందలు తగ్గనుంది. నెలవారీ వేతనం రూ. 10,800 గా నిర్ణయించి, చెల్లించేందుకు గ్రామానికి చెందిన కాంట్రాక్టరు కశింకోట శ్రీనివాసరావు పాట దక్కించుకున్నారు. అయితే విషయం తెలుసుకున్న కార్మికులు ఆవేదన చెందారు. కొన్నేళ్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచక పోగా తగ్గించి ఇస్తారా, అని మండిపడ్డారు. వేతనాలుపెంచకపోతే విధులకు తాము హాజరు కాబోమని స్పష్టం చేశారు. రెండు రోజులుగా పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. దీంతో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ని సంప్రదించారు. కార్మికులు వెంటనే విధుల్లో చేరకపోతే తాము ఇచ్చే నోటీసు కి సమాధానం ఇవ్వాలన్నారు. ఈ మేరకు కాంట్రాక్టరు ఒక్కరోజు గడువు తీసుకుని శనివారం నుంచి పారిశుధ్య పనులు చేయిస్తానని చెప్పినట్టు కార్యదర్శి తెలిపారు. శనివారం సమస్య పరిష్కారం కాకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ముమ్మరంగా వరినాట్లు



జల్లూరులో వరి నారు తీస్తున్న కూలీలు

కోటవురట్ల: వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఖరీఫ్ సాగులో భాగంగా పలు ప్రాంతాలలో వరినాట్లు జోరుగా జరుగుతున్నాయి. నాట్లు వేసే పనుల్లో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు.గత ఏడాది ఖరీఫ్ సీజనులో మండలంలో 1,750 హెక్టార్లలో వరి సాగు చేశారు. ప్రస్తుతం జల్లూరు, యండపల్లి, బి.కె.పల్లి, పాములవాక, అన్నవరం, కైలాసపట్నం, రాజుపేట, కోటవురట్ల, లింగాపురం, కె.వెంకటాపురం, రామచంద్రపురం, నీలిగుంట, రామచంద్రపాలెం ప్రాంతాల్లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో అప్పారావు

నక్కపల్లి: పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)ఎన్నికలు ఈనెల 8న ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి శుక్రవారం ఆయన నక్కపల్లిలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ కమిటీల్లో ప్రధాన పాత్రదారులు ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులేనన్నారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవలసి ఉంటుందన్నారు. వీరిలో సామాజిక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలనుంచి ఒకరు, బలహీన వర్గాలనుంచి ఒకరు, జనరల్ కేటగిరినుంచి ఒకరిని ఎన్నుకోవాలని తెలిపారు. ఈ ముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉండాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు కనీసం 50 శాతం తల్లిదండ్రులు లేదా సంరక్షకులు హాజరుకావాలని తెలిపారు. నోటిమాటతోనే గానీ, చేతులను పైకి ఎత్తడం ద్వారా గానీ, రహస్య బ్యాలెట్ విధానం ద్వారా గానీ ఎన్నికలను నిర్వహించాలని తెలిపారు. పిల్లల తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికి మాత్రమే ఎన్నికల్లో ఓటు వేసే అర్హత ఉంటుందన్నారు.పాఠశాలల్లో ఎన్ని తరగతులు ఉంటే అన్ని తరగతులనుంచి సభ్యులను ఎన్నుకోవాలని తెలిపారు.ఎన్నికల నిర్వహణపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంఈవో కె. నరేష్ హెచ్ఎంలు వేమగిరి నూకరాజు, సీహెచ్ సత్యనారాయణ,మూర్తిరాజు, రాణి లలిత, సత్యారావు,త్రినాదరావు,ఉపాధ్యాయులు ఆచార్యులు, డి.వి. సన్యాసిరావు,కొండలరావు, వెంకటరావు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు



పట్టణంలో విద్యుత్ లైన్లపై తొలగించిన చెట్ల కొమ్మలు

యలమంచిలి రూరల్: జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లపైగల చెట్ల కొమ్మలను శుక్రవారం తొలగించారు. ప్రధాన రహదారి,తులసీనగర్, జలాల్‌వీధి, ఎన్టీఆర్ కాలనీ,ఫైర్ ఆఫీస్ కాలనీ,కాకివాని వీధి ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను నరికించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణంలో ఆంధకారం అలముకుంది.ఇటీవల తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, ఎలాంటి సమాచారం లేకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని పట్టణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గణపర్తి పాలసంఘానికి నలుగురు డైరెక్టర్ల ఎన్నిక



ఎన్నికలో పాల్గొన్న గణపర్తి పాడిరైతులు

మునగపాక:మండలంలోని గణపర్తి పాలసంఘం డైరెక్టర్ల ఎన్నిక శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. కర్రి రామనాగేశ్వరరావు,నందవరపు నాయుడు,పి.శ్రీను, చదరం హేమ సంతోష్ డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఉదయం నుంచి పాడి రైతులు తమ ఓటుహక్కును చేతులెత్తే విధానం ద్వారా వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘనటలు జరగకుండా ఎస్ఐ ప్రసాదరావు బందోబస్తు నిర్వహించారు.

16 నుంచి ధర్మ రక్షణ బంధన్



సమసరత సేవా ఫౌండేషన్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

అచ్యుతాపురం: ఈ నెల 16 నుంచి 22 వరకూ ధర్మ రక్షణ బంధన్ నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి రమణ తెలిపారు.అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం-అందలాపల్లి భగీరథమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్తీక పౌర్ణమి నాడు దేవాలయాల్లో సామూహిక హారతి ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు,గుడివాడ రమణ,చోడపల్లి సత్యం,ఆడారి త్రినాథ్,భీశెట్టి దేవి,దొడ్డి కృష్ణ,పేర్ని గోవింద,భీశెట్టి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు తీరేదెన్నడో ?

- గాలి వీచినా...వర్షం పడినా విద్యుత్ సరఫరా బంద్
- నిరంతర విద్యుత్ కోతలతో అల్లాడుతున్న ప్రజలు
- సమస్య పరిష్కరించాలని పది గ్రామాల ప్రజల విజ్ఞప్తి



కలెక్టర్ ఫిర్యాదు చేసిన వినతి పత్రం కాపీని చూపిస్తున్న విద్యుత్ బాధితులు

అచ్యుతాపురం: చిన్న పాటి గాలి వీచినా... కొద్ది పాటి వర్షం పడినా... ఎక్కడైనా లైన్ నిర్వహణ పనులున్నా ఆ గ్రామాలకు విద్యుత్ సరఫరా బంద్ అవుతుంది. విద్యుత్ ఎప్పుడు పోతుందో..ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితిలో పది గ్రామాల ప్రజలు కొట్టు మిట్టాడుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని అధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. మండల పరిషత్ సమావేశంలో ప్రజా ప్రతినిధులు ఈ సమస్యను ప్రస్తావించినా మౌనమే సమాధానవుతోంది. చివరకు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో కలెక్టర్‌కు ఆయా గ్రామాల ప్రజలు వినతి పత్రం సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆయా గ్రామస్తులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఉక్కపోత, దోమల మోతతో అల్లాడిపోతున్నారు. పిల్లలు, వ్యాధి గ్రస్తుల పరిస్థితి దారుణంగా ఉంది. ఎన్టీపీసీకి అత్యంత సమీపంలో ఉన్న అచ్యుతాపురం మండలంలోని ఇరువాడ, దొప్పెర్ల, నారపాక, నడింపల్లి తదితర పది గ్రామాల ప్రజలు వేళాపాళాలేని విద్యుత్ కోతల కారణంగా తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

పరిధిపై అస్పష్టత...

ఈ గ్రామాల పరిధికి సంబంధించి ఇటు పరవాడ సబ్‌స్టేషన్,అటు అచ్యుతాపురం సబ్ స్టేషన్ సిబ్బంది ఇచ్చే సమాధానం విచిత్రంగా ఉంటోందంటూ స్థానికులు వాపోతున్నారు. పరిధిపై స్పష్టంగా చెప్పడం లేదని తెలిపారు. చీమలాపల్లిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేస్తే తమ గ్రామాల్లో విద్యుత్ కోత విధించడం ఏంటని ఇక్కడి వారు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మలు పడితే కనీసం నాలుగైదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని ఈ ప్రాంత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ కోతల కారణంగా నిత్యం చేయవలసిన పనులు నిలిచిపోతున్నాయని, వ్యాపారులకు నష్టం వస్తోందని వారు తెలిపారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి

అచ్యుతాపురం,పరవాడ శివారు ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ వెతలు తీర్చేందుకు సబ్ స్టేషన్ ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. విద్యుత్ కోతలతో పాటు లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని వారు తెలిపారు.

త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

దొప్పెర్ల,నారపాక,నడింపల్లి,ఇరువాడతో పాటు 13 కిలో మీటర్ల పరిధిలో ఉన్న లైన్‌లో విద్యుత్ సమస్యలు ఉన్న సంగతి మా దృష్టికి వచ్చింది.గతంలో ఇది ఫార్మాసిటీ పరిధిలో ఉండేది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి మా పరిధిలోకి మార్చారు.ఆయా గ్రామాల విద్యుత్ సరఫరా పర్యవేక్షణ వాడచీపురుపల్లి సబ్‌స్టేషన్‌లో లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమస్యను పరిష్కరిస్తాం.

– కృష్ణ, విద్యుత్‌శాఖ ఏఈ (అచ్యుతాపురం ఇన్‌చార్జ్)

ఉత్తమ పంచాయతీల ఎంపికకు క్షేత్రస్థాయి పరిశీలన



క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలున్న నాలుగు ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామని ఎంపీడీవో జాగరల రాంబాబు తెలిపారు. మండలంలో వల్సంపేట, వై.బి. అగ్రహారం, పెదగొలుగొండపేట, పి.కె.గూడెం పంచాయతీల్లో శుక్రవారం సిబ్బందితో కలసి ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో శతశాతం మరుగుదొడ్లు, విద్య, వైద్యం, తాగునీటి సదుపాయం, తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంతవరకు చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులపై చర్చించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగు ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసేందుకు కలెక్టరుకు నివేదిక పంపిస్తామన్నారు. ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైతే ప్రభుత్వం నుంచి పురస్కారాలతోపాటు మరింత అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరవుతాయన్నారు. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకుని మిగిలిన పంచాయతీ పాలక వర్గాల సభ్యులు, అధికారులు సంయుక్తంగా అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



ప్రిన్సిపాల్ రాధ, విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.12 వేలు విలువ చేసే సామగ్రిని పూర్వ విద్యార్థులు వితరణ చేశారు. ఇక్కడ 2012-2014 ఒకేషనల్ గ్రూపులో విద్యాభ్యాసం చేసిన విద్యార్థు లు జామి రాంబాబు, హరిప్రసాద్ గుప్తా, చెల్లారావు, ఆనంద్ శుక్రవారం ప్రిన్సిపాల్ బి. రాధకు సామగ్రిని అందజేశారు. ఒకేషనల్ గ్రూపు విద్యార్థులు 25 మందికి షార్ట్ హ్యాండ్స్ టెక్స్ట్ బుక్స్, టైప్ రైటింగ్ బుక్స్, రికార్డ్ బుక్స్ తదితర స్టేషనరీ సామగ్రిని సమకూర్చారు. గతేడాది ఒకేషనల్‌లో అధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ. 1500 చొప్పున ప్రోత్సాహకాలు అందజేశారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సేవా దృక్పథాన్ని ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రశంసించారు.

ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక శ్రద్ధ

కె.కోటపాడు: పాఠశాలలో ప్రతీ విద్యార్థి చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో డీవీడీ ప్రసాద్ తెలిపారు. మర్రివలస ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 29 మంది విద్యార్థుల చదువులపై ఆయన ఆరా తీశారు. చదువుల్లో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రుల సమావేశాల్లో ఉపాధ్యాయులు వివరించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, వేడివేడిగా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులకు రక్తహీనత సమస్య లేకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి హెచ్‌బీ పరీక్షలు చేయించాలన్నారు. రక్తహీనత సమస్య గల వారికి ఐరన్ మాత్రలను అందించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్.ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.